క్లుప్తంగా

మాజీ సర్పంచ్ వీరభద్రరావు మృతి



మండదపు వీర భద్రరావు (ఫైల్)

లింగపాలెం: లింగపాలెం మండలం కెగోకవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ రాజకీయ నాయకులు మందలపు వీరభద్రరావు (91) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన గోకవరం పంచాయతీ సర్పంచ్‌గా 20 ఏళ్ల పాటు ఏకగ్రీవంగా పనిచేశారు. వీరభద్రరావు కుమారుడు మందలపు నరిశింహరావు వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్. వీరభద్రరావు మృతి కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు తీరని లోటని, ఆయన సేవలు మరువలేనివని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. వీరభద్రరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్కౌట్, గైడ్స్‌ని సద్వినియోగం చేసుకోవాలి



స్కౌట్ గైడ్స్ విద్యార్థులతో ఎమ్మెల్యే రోషన్ కుమార్

కామవరపుకోట: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కౌట్ అండ్ గైడ్స్‌ని విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్ అన్నారు. ప్రపంచ స్కౌట్స్ స్కార్ప్స్ దినం సందర్భంగా గురువారం రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ గైడ్స్ విద్యార్థులతో ఆయన ముచ్చటించి స్కార్ప్స్ ధరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ గైడ్స్ నేర్చుకోవడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు ఆరోగ్యం, దేహదారుఢ్యం కలిగి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ గైడ్స్ జిల్లా ట్రెనింగ్ కమిషనర్ బిరుదుగట్ల నాగేశ్వరరావు, టీడీపీ జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నదాన సేవలు



ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు ఆహారాన్ని అందిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: భారీవర్షాల కారణంగా నిరాశ్రయులైన ముంపు మండలాల గ్రామాల గర్భిణులు, బాలింతలకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోందని రోటరీ అధ్యక్షుడు ఊడా రాంగోపాల్ (గోపీ) తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 42 మందికి ఆహారాన్ని అందించినట్లు చెప్పారు. పలువురు దాతలు, రోటరీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి బవిరిశెట్టి హనుమాన్ తిలక్ తెలిపారు.

బేటీ బచావో బేటీ పఢావో ర్యాలీ



దేవులపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని దేవులపల్లిలో బేటీ బచావో బేటీ పఢావో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, చదువుల్లో రాణించాలని, చదువుని మధ్యలో ఆపరాదని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త టి.శిరీష పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

ద్వారకాతిరుమల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భావితరాలకు బంగారు బాటలు వేస్తుందని మాదిగ పోరాట సమితి సంఘ నేతలు అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండలంలోని దొరసానిపాడులో గురువారం మాదిగ పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దాల వెంకటేశ్వరరావు, దిర్శిపాం ఈశ్వరరావు, దిర్శిపాం వెంకటేశ్వరరావు(108), దిర్శిపాం పోతురాజు, కలకండ రత్తయ్య, తానిగడప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నేత జెట్టి గురునాథరావు



అల్లూరినగర్‌లో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న జెట్టి గురునాథం, పార్టీ నేతలు

వేలేరుపాడు: వరద బాధితులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు అన్నారు. పెద్దవాగు ప్రభావం వల్ల సర్వస్వం కోల్పోయిన అల్లూరినగర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్ట్ వల్ల సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటపడ్డ గ్రామస్తులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రూ.3 వేల తక్షణ సాయంతో బాధితులకు ఒరిగేదేమీలేదని, కనీసం రూ.25 వేల ఆర్థికసాయం అందజేయాలని, ఇళ్లు కోల్పోయి టార్పాలిన్ కవర్‌లతో తాత్కాలిక ఇళ్లల్లో దుర్భర జీవనం సాగిస్తున్న వీరందరికీ మెరక ప్రాంతంలో పక్కా ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటాలు తప్ప ముంపు బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు వరదలు వచ్చినా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు, బాధితులందరికీ తక్షణ వరద సాయం నగదును ఆధార్‌కార్డు ఆధారంగా అన్ని గ్రామాలకు అందించామన్నారు. ఎక్కడా వివక్ష చూపకుండా పార్టీలకతీతంగా సాయం అందించడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో నీటమునిగిన ఇండ్లకే రూ.3 వేల పరిహారం అందించడం విచారకరమన్నారు. ఉపాధి పనులు లేక గత 13 రోజులుగా జలదిగ్బంధనంలో ఉన్న గ్రామాలకు కూడా రూ.3 వేల ఆర్థిక సాయంతోపాటు బియ్యం, నిత్యావసర వస్తువులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అల్లూరినగర్ గ్రామంలో 93 వరద బాధిత కటుంబాలకు రూ.50 వేలవిలువ చేసే వంటపాత్రలను జెట్టి గురునాథరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, కొలూరి సత్తిరాజు, మహేష్, గిరి, అఫ్రోజ్, ఆరిఫ్, రాజా, సన్నేపల్లి శ్రీను పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

కుక్కునూరు: గత పదిరోజులుగా పెరుగుతూ, తగ్గుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి వరద శాంతించింది. గురువారం భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు దిగువకు 40 అడుగులకు వరద ప్రవాహం చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. కాగా గోదావరి వరద శాంతిండంతో ఇప్పటికి గండం గడిచినట్టేనని అటు అధికారులు, ఇటు విలీన మండలాల నిర్వాసితులు ఊపిరిపీల్చుకున్నారు. గత అనుభవాల ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా గోదావరికి వరదలు చవిచూసిన రోజులుండడంతో ముున్ముందు గోదావరి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం నిర్వాసితులను వెంటాడుతుంది. కాగా శాంతించిన గోదావరి వరదతో పంట చేలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ప్రతి ఏడాది వరదతో ఈ బాధలు భరించలేకపోతున్నామని, ఇకనైనా ప్రభుత్వం ఆర్అండ్ఆర్ పరిహారం అందించి పునరావాస కాలనీలకు తరలించాలని నిర్వాసితులు కోరారు.

నీటమునిగిన వరి పంటలు



ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలో నీటమునిగిన వరి పంటలు

ద్వారకాతిరుమల: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వరి పొలాలు, ఇతర పంటలు నీట మునిగాయి. అలాగే చెరువులు పూర్తిగా నిండిపోయాయి. అందులో భాగంగా దేవినేనివారిగూడెంలోని గుర్రాల వాగు నిండిపోవడంతో వరి పంటల్లోకి వరదనీరు భారీగా చేరింది. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఏం చేయాలో తెలియక రైతన్నలు లబోదిబోమంటున్నారు.

దోమల నివారణకు సహకరించాలి



రేచర్ల రెండో మైల్ రాయి తండాలో బ్లీచింగ్ చల్లిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్

చింతలపూడి: దోమల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ పిలుపునిచ్చారు. రేచర్ల రెండో మైల్ రాయి తండాలో మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. మురికి కాలువల్లో నిరుపయోగమైన ఆయిల్స్ వేయడం, దోమల సంహారిక మందులు పిచికారీ చేయడం ద్వారా దోమలను అదుపు చేయవచ్చునని చెప్పారు. మురికి నీటి కాలువలు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: ఈ నెల 2వ తేదీన 11కేవీ ఎంహెచ్క్యూ–2 ఫీడర్ లైన్ మరమ్మతులు, ట్రీకటింగ్ పనులు నిమిత్తం పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిబాలాజీ టౌన్‌షిప్, హరిజనపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

4న ధ్యానంతో సజ్జన సాంగత్యంపై శిక్షణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శేషాద్రినగర్ మైత్రేయ మందిరంలో ఈనెల 4వ తేదీన ధ్యానంతో సజ్జన సాంగత్యం అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్, పిరమిడ్ గృహస్థాశ్రమ నిర్వాహకులు ఎస్.మునిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణ అందిస్తారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు శిక్షణ ఉంటుందని, ధ్యానులు, ఆరోగ్యాభిలాషులు, ఆధ్యాత్మిక సాధనా మార్గంలోని వారు, ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు. శిక్షణలో భాగంగా మధ్యాహ్నం సాత్విక ఆహారం అందిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఎంఆర్‌పీఎస్ హర్షం



జంగారెడ్డిగూడెంలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ నాయకులు



కొయ్యలగూడెంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎంఆర్‌పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎస్సీలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని కోరుతూ మంద కృష్ణ మాదిగా ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ 30 ఏళ్లుగా పోరాడుతుందని, ఇందుకు తగిన ప్రతిఫలం దక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేసి 58 కులాలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో తొలుత అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లాగు రవిబాబు, ముప్పిడి శ్రీనివాసరావు, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, మర్రి వెంకటేశ్వరరావు, గొల్లమందల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఎంఆర్‌పీఎస్ శ్రేణులు గురువారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. కొయ్యలగూడెంలోని కొవ్వూరు రోడ్లో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన సెంటర్లో వినాయకుడి ఆలయం వద్ద భారీ కేకు కట్ చేసి, విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మూడు దశాబ్దాల కాలంగా మందా కృష్ణ మాదిగ చేస్తున్న పోరాట ఫలితమే ఎస్సీ రిజర్వేషన్ అమలు కావడం అని ఎంఆర్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సనమండ్ర కనకరాజు, సొంగ వెంకటేష్, కై కవరపు గోపి, ఏలేటి చిన్న తుక్కయ్య, ఏలేటి చంద్రరావు, బొబ్బర చిట్టిబాబు, కై కవరపు గోపి, తమిర్చి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు

లింగపాలెం: ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై వైఎస్సార్ సీపీ మాజీ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంలో 30 ఏళ్లగా ఎంఆర్‌పీఎస్ నేతలు ఎంతో మంది అశువులుబాశారన్నారు. అలుపెరుగని పోరాటం చేసిన ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో గురువారం జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం వ్యాపారుల నిరసన



కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న ధాన్యం వ్యాపారులు

కొయ్యలగూడెం: ధాన్యం వ్యాపారులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని, కొందరు రైతులు సంబంధం లేకుండా తమకు చెందిన ధాన్యం గోడౌన్స్‌ల వద్ద కావాలనే ఆందోళనలు చేస్తున్నారని కొయ్యలగూడెం మండలానికి చెందిన ధాన్యం వ్యాపారులు గురువారం ఆందోళన నిర్వహించారు. కొయ్యలగూడెం మండల పరిసర ప్రాంతాల్లో సక్రమమైన పద్ధతిలో తాము వరి, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసి గోడౌన్స్‌లలో నిల్వ చేసుకున్నామని అందుకు సంబంధించిన వేబిల్స్, రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన రసీదులు ఉన్నాయన్నారు. కానీ గత కొద్ది రోజులుగా వేరే ప్రాంతానికి చెందిన రైతులు వాళ్లనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన దళారులను ప్రశ్నించకుండా తమపై నిందారోపణలు చేస్తున్నారన్నారని, సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో సామూహికంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు పసుపులేటి రాంబాబు, వెలగా శ్రీరామమూర్తి, కొల్లూరి రాంబాబు, ఉద్దగిరి నగేష్, మానేపల్లి రామారావు, కొల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో



గవరవరంలో హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: దళారీల వ్యవస్థతో మోసపోయిన పోలవరం మండల ధాన్యం రైతులకు న్యాయం చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పేర్కొన్నారు. గవరవరం గ్రామంలో గోడౌన్స్ వద్ద రైతులు నిర్వహిస్తున్న ఆందోళన శిబిరానికి ఆయన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి గురువారం విచ్చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం– తాడేపల్లిగూడెం హైవేపై రైతులతో బైఠాయించి రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సుమారు వంద మందికి పైగా రైతులకు మూడున్నర కోట్ల రూపాయలు బాకీదారులైన అసలు దళారులు ఎవరో సంబంధిత అధికారులు గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల బాకీ సొమ్ములు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



కుక్కునూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కుక్కునూరు: గోదావరి వరద బాధితులకు వరద ముంపుతో సంబంధం లేకుండా నిర్వాసితులందరికి పరిహారాన్ని అందించాలని కోరుతూ గురువారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ 2022, 2023వ సంవత్సరాల్లో వచ్చిన గోదావరి వరదల్లో ముంపుతో సంబంధం లేకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 వేలు పరిహారం అందించి నిత్యావసర సరుకులను పంపిణీ చేసిందన్నారు. కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వం జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలకు పునరావాస కేంద్రాల్లో నివాసం ఉంటున్న వారికి మాత్రమే బియ్యం, కూరగాయలు, రూ.3 వేలు నష్టపరిహారం మాత్రమే ఇచ్చిందన్నారు. నిర్వాసితులందరికీ బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు, రూ.3 వేల పరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ మండల నాయకులు కె కల్లయ్య, ఎం మల్లేష్, పీఓడబ్ల్యూ నాయకురాలు షేక్ మున్ని, ఎం లక్ష్మయ్య, పి వీరబాబు, ఎం లక్ష్మయ్య, కె నాగేశ్వరరావు, కె జోగయ్య, ఎస్ ముత్యాలు, ఎం కుమారస్వామి, ఎం ప్రశాంతు, కె వెంకయ్య, కె ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు మొదటి టీకా



బుట్టాయగూడెంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: తల్లిపాలల్లో మహత్తర శక్తి ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. రూన్సీ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం బుట్టాయగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవమాసాలు మోసి బిడ్డను కనిపెంచడంలో తల్లిపాత్ర కీలకమైనదని అన్నారు. పిల్లల సక్రమమైన అభివృద్ధికి తల్లిపాలు చాలా అవసరమని అన్నారు. బిడ్డకు పౌష్టికాహారాన్ని ఇవ్వడమే కాదని తల్లిబిడ్డల బాంధవ్యాన్ని పెంచుతుందని అన్నారు. తల్లిపాలు పిల్లలకు మొదటి టీకాగా పనిచేస్తాయని అన్నారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరించారు. తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, పాలిచ్చే తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గర్భిణులు, బాలింతలకు ఏరియా ఆసుపత్రి వైద్యులు సునీత, దీప్తి సూచించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలింత తల్లులకు, గర్భవతులకు ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ అధికారిణి బ్యూలా, సూపర్‌వైజర్ లక్ష్మి, హెచ్‌వీ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు. కాగా, స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బాల్యవివాహాల నిరోధక చట్టాల గురించి దత్తత స్వీకరణ చట్టాల గురించి హోర్డింగులు ఏర్పాటు చేశారు.

కొయ్యలగూడెం: ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమం బయ్యనగూడెం–2 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం నిర్వహించినారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రిపాలు ఇవ్వాలని, ఇవి సహజమైన టీకాగా ఉపయోగపడతాయన్నారు. బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్‌బాషా, సిబ్బంది కె.మరియమ్మ, ఎం.రవితేజ, పద్మావతి, ఎం.నాగమణి, ఆశ కార్యకర్తలు శాంతకుమారి, నళిని, స్వర్ణ కుమారి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



కల్పనబాబు కుటుంబానికి పోస్టల్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కుక్కునూరు: తమతో చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచారు పూర్వ విద్యార్థులు. ఇటీవల కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997–98వ సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమతోటి విద్యార్థి మాచర్ల కల్పనబాబు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని తెలుసుకోని, ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు తమవంతు సాయంగా రూ.60 వేలు నగదు వసూలు చేశారు. ఆ మొత్తాన్ని కల్పనబాబు ముగ్గురు కుమార్తెల పేర్ల మీద గురువారం పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి ఆ డిపాజిట్ బాండ్లను ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వనమా భద్రరావు, ములిశెట్టి నరేష్, రాజేష్, బాబు, సమయవంతుల లక్ష్మణ్, వేల్పుల సురేష్, భాస్కర్, పరిటాల వెంకన్న, గురిజాల రామక్రిష్ణ పాల్గొన్నారు.

రజక సంఘ నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల గ్రామ శ్రీ వేంకటేశ్వర రజక సంఘ నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక రజక విశ్రాంతి భవనం వద్ద జరిగిన సంఘ సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా తొంటపాక భగవన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా యండమూరి శ్రీనుబాబు(చక్రీ), కోశాధికారిగా గరిసేపల్లి రాజేష్, సభ్యులుగా చెన్నూరి శ్రీనివాస్, అంతర్వేది చిట్టిబాబు, యండమూరి సత్యన్నారాయణ, యండమూరి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

కుక్కునూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ దినోత్సవ నవోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎర్రపాడు గ్రామంలో ఆదివాసీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ 1982లో ఏర్పడిన యూఎన్‌ఓ కమిషన్ ప్రపంచ వ్యాప్తంగా స్థితిగతులు, జీవన విధానంపై అధ్యయనం చేసి ఆదివాసీల హక్కులు, సంస్కృతి, భాషను పరిరక్షించాలని, 1994లో ఐక్యరాజ్యసమితిలో ప్రతి ఏటా ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం ఉండాలని నిర్దేశించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వెనకబడిన ఆదివాసీ తెగలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాలు, ఉపాధి అవకాశాల్లో ఈ తీర్పువల్ల న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పైదా పరమేశ్వరావు, చిన్నబాబు, వేణుగోపాల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ ఆకు సేకరణ బకాయిలు వెంటనే చెల్లించండి

కుక్కునూరు: వేసవి కాలం మండుటెండలో అడవి చుట్టూ తిరిగి బీడీ ఆకు కోసిన కూలీల డబ్బులు ఇంకా చెల్లించకపోవడం పట్ల విలీన మండలాల బీడీ ఆకు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఈ విషయమై వారు పత్రికలకు ఓ ప్రకటనను విడుదల చేశారు. బీడీ ఆకు కోతలు జరిగి నెలలు గడుస్తున్నా ఇంతవరకు తమకు బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ విషయమై అటవీశాఖాధికారులను అడిగితే ఎప్పుడిస్తారన్న విషయం తేల్చడంలేదన్నారు. ఇప్పటికైనా బీడీ ఆకు కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.